వేదాంతభేరి

నవంబరు 2020 రూ. 10/-



వేదాంతభేరి

నవంబరు 2020

రూ. 10/-

నీవు మారితే సమాజం మారుతుంది.

నీవు సమాజంలో ఒక సభ్యుడవు. సమాజం వ్యక్తిపై ఆధారపడి యుంది. కనుక సమాజం మారాలంటే నీవు సమాజంలోనికి పోయి ఊరికే ఉపన్యాసాలిస్తే ప్రయోజనం లేదు. మొట్టమొదట నీవు మారాలి. నీవు మంచివాడవు కాకుండా సొసైటీని మంచిగా మార్చాలంటే అది సాధ్యం కాదు. నీ హృదయాన్ని పవిత్రంగా మార్చుకొన్నప్పుడే సొసైటీని పవిత్రంగా మార్చగల యోగ్యత నీకు వస్తుంది.

హరిశ్చంద్రుడు సత్యంకోసం తన సర్వస్వాన్ని త్యాగం చేశాడు. చివరికి తాను కాటికాపరిగా పనిచేయవలసి వచ్చినా చలించలేదు. అట్టి దీక్షతో వుండడమే నిజమైన యోగ్యత.

– భగవాన్ శ్రీ సత్యసాయిబాబా

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 53 నవంబర్ 2020 సంచిక : 11

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ **వేదాంతభేరి** ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 53 **నవంబర్ 2020** **సంచిక : 11**

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. మనసి విచిన్తయ వారం వారం
- శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06

03. సద్గురు సందేశము - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 15

04. శ్రీ గురుగ్రంథ సాహిబ - 17

05. సాధన పంచకమ్ - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 21

06. మాయ - శ్రీసర్వాత్మానందగిరిస్వాములవారు -25

07. శ్రీ గురు నానక్ - డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 29

08. త్రిమూర్తులు - శ్రీ మధుసూదన సరస్వతి - 33

09. పౌరాణిక సూక్తులు - ఆచార్య కె.సర్వోత్తమరావు - 34

10. దశావతారస్ఫూర్తి - శ్రీమతి ఆర్.శోభాదేవి - 37

11. పూజ్యశ్రీ ప్రజ్ఞారణ్యస్వామికి శ్రద్ధాంజలి - 41

12. వార్తలు - 42

ముఖచిత్రం - శిక్కుల ఆది గురువు శ్రీగురునానక్

14.11.2020 దీపావళి, కేదారవ్రతం

18.11.2020 నాగులచవితి

23.11.2020 శ్రీ సత్యసాయిబాబా జయన్తి

29.11.2020 కార్తీక పూర్ణిమ

29.11.2020 శ్రీ గురునానక్ జయన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. ఓమ్ యో బ్రహ్మాణం విదధాతి పూర్వం
యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై ।
తగ్ం హ దేవమాత్మబుద్ధి ప్రకాశం
ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥

2. ఓం సత్యం జ్ఞానమనంతం యత్
నిష్కళం నిష్క్రియం పరమ్ ।
అద్వితీయం నిర్విశేషం
బ్రహ్మ తత్సముపాస్మహే ॥

3. ఓం యతః సర్వాణి భూతాని
ప్రభవన్తి స్థితాని చ ।
యత్రైవోపశమం యాన్తి
తస్మై సత్యాత్మనే నమః ॥

4. ఓం జ్ఞాతా జ్ఞానం తథా జ్ఞేయం
ద్రష్టా దర్శన దృశ్యభూః ।
కర్తా హేతుః క్రియా యస్మాత్
తస్మై జ్ఞప్త్యాత్మనే నమః ॥

5. ఓం స్ఫురన్తి శీకరా యస్మాత్
ఆనందస్యాంబరే ఽవనౌ ।
సర్వేషాం జీవనం తస్మై
బ్రహ్మానందాత్మనే నమః ॥

మనసి విచిన్తయ వారం వారం

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

బ్రహ్మచర్యమును సాధించదలంచువారు బ్రహ్మచర్య విధులను, నియమములను చక్కగ అభ్యాసము చేయవలెను.

మనస్సు అను ప్రవాహము రెండు మార్గములుగా ప్రవహించును- శుభమార్గము, అశుభమార్గము అని. వివేకవంతుడు అశుభ మార్గమును నిరోధించి ఆ శక్తిని అభ్యాసముచే శుభమార్గమందే వినియోగించి ధన్యుడగును.

కాబట్టి ప్రయత్నపూర్వకముగ ప్రతివారును తమ యందలి అసుర ప్రవృత్తులను పారద్రోలి, దైవసంపదను అభివృద్ధి పఱచుకొనవలెను. పాపవాసనలను పోగొట్టుకొని పుణ్యసంస్కారములను కలుగజేసికొన వలెను. అయితే ఇక్కార్యమునకు సాధన చాల అవసరము. అనేక జన్మల నుండి అలవాటైన కుప్రవృత్తులు, దుస్సంస్కారములు ఒక రాగాన వెంటనే నశింపవు. అవి హృదయ క్షేత్రమున బాగుగ రూఢిపడి యుండును. కావున మంచి అలవాట్లను, సత్సంస్కారములను బాగుగ అభ్యసించవలెను. కనుకనే శ్రీశంకరులు 'మనసి విచిన్తయ వారం వారమ్' అని సెల విచ్చుటకు కారణము. సత్యసిద్ధాంతములను మరల మరల చింతన చేయవలెనని వారు ఆనతిచ్చిరి. కావున అభ్యాసము చాల అవసరము.

సాధనంబును చేయవలెనన్నా

అనుభూతియంతయు, సాధనంబుచె గట్టిపడునన్నా

నియమపూర్వక నిష్ఠచేతను

మురికినంతను తొలగద్రోచియు

నిర్మలంబగు మానసంబున

దేవదేవుని గాంచుచుండుము. ॥ త ॥

హార్మోనియం, టైపుకొట్టుట, సైకిల్ త్రొక్కుట మొదలైన వానిని ప్రతిరోజు అభ్యసించుటచే కొద్ది దినములకు వానిలో మనుజుడు ప్రావీణ్యము నెట్లు సంపాదించుచున్నాడో, అట్లే దైవవిద్య, సచ్ఛీలము మొదలైనవి కూడ నిరంతరాభ్యాసముచే దృఢత్వమును పొందగలవు.

అజ్ఞోపి తజ్ఞతామేతి శనైః శైలో ఽ పి చూర్ణ్యతే ।

బాణో ఽ ప్యేతి మహాలక్ష్యం పశ్యాభ్యాస విజృంభితమ్ ॥

అభ్యాసముచే తెలివి తక్కువవాడు తెలివిగలవాడగును. ప్రతిరోజు కొంచెము కొంచెము రాతిని పగులగొట్టుచు పోయినచో, కొంత కాలమునకు పర్వతము కూడ చూర్ణమైపోవును. అట్లే గురిని అభ్యసించుటచే కొంత కాలమునకు బాణముచే లక్ష్యమును చక్కగా భేదింపగలుగుచున్నాడు. ఇదియంతయు అభ్యాసముయొక్క మహిమయేయని శ్రీ వసిష్ఠమహర్షి యోగవాసిష్ఠమున చెప్పిరి.

కావున, శాస్త్రానుకూలమగు పురుష ప్రయత్నము నాశ్రయించి జీవుడు బంధవిముక్తికొఱకు,లక్ష్యసాధనకొఱకు అహర్నిశములు పాటు పడవలయును.

గత దినమందలి అజీర్ణాది దోషములు నేటి ఔషధాది గుణములచే క్షయించులాగున ఈ జన్మయందలి శుభ పురుష ప్రయత్నముచే పూర్వజన్మపు అశుభ పురుష ప్రయత్నము నిస్సందేహముగ శమించిపోవును.

సంసార కుహరాదస్మా న్నిర్గన్తవ్యం స్వయం బలాత్ ।

పౌరుషం యత్నమాశ్రిత్య హరిణేవారిపంజరాత్ ॥

"ఉత్తమ పురుష ప్రయత్నము నాశ్రయించి ఈ సంసారమను గోతి నుండి- శత్రుపంజరమునుండి సింహమువలె - స్వయముగ బలాత్కారముగ బయల్వెడలవలెను." విశ్వామిత్రుడు తనయొక్క తీవ్ర పురుష ప్రయత్నమువలననే బ్రహ్మర్షి కాగలెను. భగీరథుడు తనయొక్క ప్రయత్నాతిశయము వలననే గంగను భూలోకమునకు రప్పింపగల్గెను. బుద్ధదేవుడు తనయొక్క అకుంఠిత ప్రయత్నముయొక్క ప్రాబల్యము చేతనే నిర్వాణమను లక్ష్యమును తన జీవితమందే చేరగల్గెను. ఇదే ప్రకారముగ ఎందరో ఋషులు, మునులు, మహనీయులు తమయొక్క పురుష ప్రయత్నముయొక్క మహిమచే లక్ష్యమగు పరమాత్మను బొందగల్గిరి. కావున, మెఱపువలె చంచలమైనట్టి ఈ సంసారమును బొందిన మనుజుడు సచ్ఛాస్త్ర, సాధుజన సాంగత్యములచే అజ్ఞానమను బురదనుండి సార వస్తువగు ఆత్మను ఉద్ధరింపవలెను. వార్ధక్యము రాకమునుపే, బాల్య, యౌవనములందే ఈ సంసారమను మహాసముద్రమును విశుద్ధబుద్ధియను నావచే దాటి వేయవలెను. ఏది శ్రేయమో దానిని ఇపుడే ఆచరించవలెను. వృద్ధుడైన పిదప మనుజుడేమి చేయగలడు? అత్తఱి అతని స్వంత అవయువములు కూడ అతనికి భారభూతములుగ తోచును. ఆత్మజ్ఞానార్థము ధృఢ ప్రయత్నము గావించినచో తనకు తానే బంధువగును. అట్లు కాకున్న తనకు తానే శత్రువగును. ఇవ్విధముగ వివేకాదుల ద్వారా పురుష ప్రయత్నముచే తన్ను తాను ఉద్ధరించుకొననిచో ఇక తనయొక్క రక్షణయందు వేఱు ఉపాయమెద్దియును లేదు.

ఇహైవ నరకవ్యాధేశ్చికిత్సాం న కరోతి యః ।
గత్వా నిరౌషధం స్థానం సరుజః కిం కరిష్యతి ॥

'నరకమను వ్యాధికి ఈ లోకమున ఎవడు చికిత్సగావించు

కొనడో, అట్టి భవరోగగ్రస్తుడు (శాస్త్ర సత్సాంగత్యాది) ఔషధములు లేని ఇతర లోకములకు జని ఏమి చేయగలడు?' కావున సంసార దుఃఖనివారకమగు పురుష ప్రయత్నము నాశ్రయించి తరింపవలెను.

న తపాంసి న తీర్థాని న శాస్త్రాణి జయన్తి చ ।
సంసార సాగరోత్తారే సజ్జన సేవనం వినా ॥

సంసార సముద్రమును దాటుటయందు తపస్సులు కాని, తీర్థములు కాని, శాస్త్రములు కాని సజ్జనులగు మహాత్ముల సేవనము లేనిచో విజయవంతములు కానేరవు. నావికుని యొద్ద నౌక లభించునట్లు మహానుభావుడగు జ్ఞానియొక్క సాంగత్యము వలన, సంసార సముద్రమును దాటుటకు యుక్తి లభించును. దారిద్ర్యము, మరణము, దుఃఖము–ఇత్యాది విషయములతో కూడిన ఈ సంసార భ్రమయను రోగము సాధుజన సాంగత్యమను ఔషధముచే సంపూర్ణముగ నశించిపోవును.

మహాకష్ట పరిస్థితులు సంప్రాప్తించినప్పటికిని కూడ మనుజులు సాధుజనసాంగత్యమును ఒకింతైనను వదలరాదు. మఱియు, దరిద్రుడు మణులను వెదకునట్లు పరమాత్మయందు విశ్రాంతి నొందిన మనస్సు గలవారును, ధన్యులునైన సాధుమహాత్ములను ప్రయత్నపూర్వకముగ వెదకి సేవించవలెను.

ఇవ్విధముగ సజ్జనసాంగత్యము నలవఱచుకొని, అమ్మహనీయుల ముఖతః పరమాత్మబోధను శ్రవణము చేయుచు శమదమాది సద్గుణములను మొట్ట మొదట సంపాదించవలెను. ఆపనిచే చిత్తము శుద్ధమగును. మలిన చిత్తమున గురూపదిష్ట జ్ఞానము, వివేకము ప్రవేశింపదు మఱియు మలిన వస్త్రమందు రంగు నిలువనట్లు, మలిన చిత్తమున అద్వైతాత్మజ్ఞానము స్థితి బొందదు. చిత్తము పాపపంకిలమై యున్నపుడు అందు ఆత్మజ్ఞాన

ముచయింపదు. ఎపుడూ సచ్ఛాస్త్రపఠన, సజ్జనసాంగత్య పుణ్యకర్మాచరణ ములచే సార (ఆత్మ) పదార్థము నవలోకింప శక్తిగల వివేకయుక్తమగు బుద్ధి మనుజునకు జనించుచున్నది. తెల్లని వస్త్రము రంగును గ్రహించునట్లు, శుభగుణములను జలముచే నిర్మలమైనట్టి మనస్సు బ్రాహ్మీ దృష్టిని గ్రహించుచున్నది. కాబట్టి మొట్ట మొదట సచ్ఛాస్త్రములచేతను. ఉత్తమ వైరాగ్యముచేతను, సజ్జన సాంగత్యము చేతను, అభ్యాసముచేతను మనస్సును పుణ్యవంతముగను,శుద్ధముగను నొనర్చవలెను.

భయంకరమగు మాయతో పోరు సల్పువానికి వ్రతములు, జపములు, తపములు, నియమములు, నిష్ఠలు, పరమావశ్యకములు. సామాన్యముగ మనస్సు చెప్పినమాట వినదు. మదగజమునకు అంకుశము అవసరమయినట్లు, తిరుగుబాటు చేయు మనస్సునకు వ్రతాల సహాయము లేనిచో దానిని లొంగదీయుట కష్టసాధ్యము. కనుకనే మనో నిగ్రహము కొఱకు ఇంద్రియదమనము కొఱకు పూర్వీకులు ఎన్నియో వ్రతములను ఏర్పరచిరి.

అట్టి వ్రతములను జనులు అపుడప్పుడు శీలించుచు,జన్మార్జిత ప్రాపంచిక దుష్టవాసనలను దూరీకరించుచు విశుద్ధ సత్త్వగుణాశ్రయము ద్వారా ఈ జన్మమునందే దైవత్వమును బడసి పరమానంద మనుభవించ వలయును.

అయితే ఇట్టి వ్రతసంబంధమైన చక్కని నియమములను, ఆధ్యాత్మిక క్రమశిక్షణను, ఇంద్రియ సంయమమును కేవలము వ్రత కాలమునకు మాత్రమే పరిమితము చేయుట సామాన్య సాధకుని లక్షణము. వ్రతానంతరము కూడ, అనగా ఎల్లకాలములందును వానిని ఆచరించుచు, దైనందిన జీవితమునందు వానిని కార్యరూపమున ధరింపజేయుచు, వానిని ఒక అలవాటుగ జేసికొనుట ఉత్తమ సాధకుని లక్షణము. కాబట్టి వ్రతనిష్ఠులు

తమ వ్రతకాల పవిత్రతను, నిర్మల భక్తిని, సౌమ్యత్వమును, సాత్త్విక హృదయమును ఎల్లవేళలయందును జీవితాంతము వఱకు కొనసాగించుట శ్రేయస్కరము. ఈ ప్రకారముగ వ్రతాదుల అభ్యాసము ద్వారా, నియమముల ద్వారా మానవుడు తన జీవితమునందు గొప్ప ప్రగతిని సాధించవలెను.

ప్రగతి శీలత్వము (Progress) గంభీర మానవుని స్వభావము. ఎల్లపుడు ఒకే స్థితియందుండుట కాతడు ఒప్పుకొనడు. దినదినము ఒక్కొక్క మెట్టు పైకి పోవుచు ఉన్నత శిఖరముల నధిష్ఠించవలెనని మనుజుడు సంబరపడుచుండును. తదనుకూలముగ వ్యవరించునుగూడ. కొందఱు భౌతిక విజ్ఞాన (Science) రంగమున, కొందఱు సాహిత్య రంగమున, కొందఱు రాజకీయ క్షేత్రమున తమ విజ్ఞతను అభివృద్ధి పఱచుకొనుచు ముందునకు పోవుచుందురు. కాని అది చాలదు. నైతిక, ఆధ్యాత్మిక రంగములందు గూడ పురోభివృద్ధి సాధించవలెను.

'డార్విన్' అను పాశ్చాత్యవైజ్ఞానికుని పరిణామవాదము (Theory of evolution) ననుసరించి కోతి క్రమ వికాసము నొంది మానవుడుగా మారినదని కొందఱు చెప్పుదురు. కోతి మానవుడగుట అట్లుండ అసలు ప్రాణి కోతి యగుటకు ఎన్నికోట్ల జన్మల నెత్తియుండునో యోచించు కొనవలెను. ఈ ప్రకారముగ మానవత్వమును బడయుటకు జీవుడు ఎంతటి ప్రయత్నము నాచరించెనో, ఎన్ని యోనులందు తిరుగాడెనో, ఎన్ని మజిలీలు దాటెనో గ్రహించుకొనవలెను. ఇదియంతయు అతి దీర్ఘ కాలమున జరిగిన పరిణామము. కాని ఈ పరిణామము, ఈ క్రమ వికాసము ఇంతటితో ఆగరాదు. మానవత్వోపలబ్ధి మాత్రముతో జీవుని వికాసమునకు 'బ్రేక్' (నిలుపుదల) పడరాదు.

వానరుడు నరుడగుట మంచిదే కాని, నరుడు నరుడుగనే

ఎల్లప్పుడుండుట వాంఛనీయము కాదు. నరుడు నారాయణుడు కావలయును. పురుషుడు పురుషోత్తముడై పఱగవలయును. అంతటితో జీవుని ప్రయత్నము పరిసమాప్తమగును. ఎపుడు మానవుడు మాధవుడగునో, ఇక అతనికి చేయవలసిన కార్యమేమున్నది? సమస్త సాధనలు అచ్చోట అంతమైపోవును. దైవత్వమును బడయుటతో జీవుని క్రమ వికాసము పరాకాష్ఠనందుకొనును. అదియే చరమస్థితి. అదియే కైవల్యము. అదియే సంసార బంధవిచ్ఛిత్తి. పరమానంద దాయకమగు అట్టి అనుపమదైవస్థితిని మోక్షస్థానమును బడయుటయే జీవుని పరమావధి. ఏకైక లక్ష్యము.

అట్టి లక్ష్యమును జేరుటకై ముముక్షువు గొప్ప తపస్సు నాచరింపవలయును. ఇంద్రియములను చక్కగ నిగ్రహించవలెను. బ్రహ్మచర్యమును శీలించవలెను. మనస్సును అదుపులోనికి తీసికొనిరావలెను. సర్వేశ్వరుని యెడల, సద్గురుని యెడల భక్తిని పెంపొందించుకొనవలెను. ప్రాపంచిక విషయముల యెడల, దృశ్యభోగముల యెడల క్షణిక విలాసముల యెడల పరిపూర్ణ విరక్తిని సంపాదింపవలెను. మనస్సును బహిర్ముఖ పదార్థముల వెంట పరుగిడనీయక, అరికట్టి, ప్రత్యాహారమొనర్చి, అంతర్ముఖముచేసి ఆత్మయందు స్థాపించవలెను. అయితే బహుజన్మార్జిత దృశ్య వాసనా బలముచే మనస్సు శీఘ్రముగ లొంగదు. అందులకు శిక్షణ (Spiritual discipline) చాల అవసరము. కొన్ని నియమములు, కొన్ని వ్రతములు, కొన్ని సాధన పద్ధతులు అవలంబించి అకుంఠిత దీక్షతో వానిని కార్యాన్వితమొనర్చుటకై యత్నింపవలెను. మన పూర్వీకులందువలననే ఏకాదశీ వ్రతము, మౌనవ్రతము, కార్తీక వ్రతము, మాఘవ్రతము, చాతుర్మాస్యవ్రతము మున్నగు వ్రతములను సృష్టించి వానిని దీక్షతో కొనసాగించినచో మనస్సుపై గొప్ప విజయమును సంపాదించవచ్చునని బోధించిరి.

లౌకిక రంగమున గాని, పరమార్థరంగమున గాని ప్రయత్నము లేనిచో, అభ్యాసము గావింపనిచో ఏ కార్యమున్ను సాధింపబడదు. సైకిల్ త్రొక్కునపుడు ప్రారంభములో మహాభీతిగా నుండును. కాని కొన్నాళ్ళు అభ్యాసము చేసిన పిదప రెండు చేతులు వదలివేసి కూడ సునాయాసముగ దానిని మనుజుడు త్రొక్కగల్గును. పాఠశాలయందు విద్యార్థి సోమరితనమును వీడి పట్టుదలతో కొన్ని సంవత్సరములు విద్యను సాధించినపుడు మాత్రమే పట్టభద్రుడు కాగల్గుచున్నాడు. ఒక చిన్న డిగ్రీ సంపాదించుటకే ఇంత ఓపిక, అధ్యవసాయము, స్థిర నిశ్చయము, అభ్యాసము అవశ్యకమైయుండ ఇంక ఎన్ని జన్మలనుండియో కరుడు కట్టియున్న కఠినమగు మనస్సును కరిగించుటకు, లొంగదీయుటకు ఎంత శ్రమ, ఎంత సాధన, ఎంత అభ్యాసము గావింపవలసియుండునో యోచించుకొనవచ్చును.

"రసరీ అవత జాతతో శిల్ పర్ హోత నిశాన్"

"చీమ ప్రతి దినము ఒక శిలపై నడచుచుండినచో కొన్నాళ్ళకు ఆ శిలపై ఒక చిహ్నము ఏర్పడును.' కఠినమైన శిలను భేదించు సామర్థ్యము అల్పమగు చీమకు ఎట్లు కల్గినది? అభ్యాస ప్రాబల్యముచే, నిరంతర ప్రయత్నముచే. బావిగట్టుపై ప్రతి దినము ఒక కుండను పెట్టుచుండినచో కొంత కాలమునకు గట్టుపై కుదురు ఏర్పడును? రాతిని ఖండించు శక్తి కుండకు ఎట్లేర్పడినది? నిరంతర సాధనచే. అట్లే భయంకరమైన అజ్ఞానమును జీవుడు సంతత ఆత్మవిచారణచే పటాపంచలు చేసి వేయగల్గుచున్నాడు. దేనికి వశీభూతులై జనులు అనాది కాలము నుండి ఈ సంసార సాగరమున బడి దరిగానక ఈదులాడుచున్నారో, ఈ జనన మరణాది సుఖములకు లోనగుచున్నారో, ఏది ఆత్మానుభూతికి ప్రధానమగు అడ్డుగోడగా నిలిచియున్నదో అట్టి మనస్సు యొక్క నిగ్రహమును సాధకుడు అభ్యాసముచే అవలీలగ సాధించి వేయ గలుగుచున్నాడు.

కాబట్టి ప్రతి దినము మనస్సును లొంగదీయుటకు కనీసము ఒక గంట సేపైనను చక్కగ సాధన చేయవలెను. మనస్సు ఎక్కడికి పరుగెత్తుచున్నదో బాగుగ కనిపెట్టి విచారణచే దాని నచ్చోట నుండి తెచ్చి ఆత్మయందు స్థాపించుచుండవలెను. దైవమును గూర్చియే చింతించుట, దైవమును గూర్చియే పరస్పరము బోధించుకొనుట, దైవ ప్రతిపాదకములగు ఆధ్యాత్మ శాస్త్రములనే నిరంతరము శీలించుట, అధ్యయనము చేయుట మొదలగు కార్యములను గావించుచుండవలెను. అపుడు మనస్సు దైవ భావనామయమై యుండును.

మనసా చేయుము మాధవు ధ్యానము

నిత్య నిరంజను నిర్మలాత్ముని ॥ మనసా ॥
ఎంత నిరుపమం బాతని తేజము
ఎంత మోహనం బాతని రూపము
ఎంత చేరువో ఎల్ల భక్తులకు
ఎంత ప్రియతముండతడో వారికి . ॥ మనసా॥
విమల వికాసము చెందు ప్రేమలో
కోటి చంద్ర నిభతేరుగేరుచు
మెరుపు తీగవలె మెరయు రూపప్రభ
గగురుపాటుతో గూర్చు సౌఖ్యమును. ॥ మనసా ॥
హృదయ పద్మమున నతని చరణముల
నర్చనచేయుము దివ్య ప్రేమతో
శాన్త చిత్తమున కాన్తికనులతో
గాంచు మెందు గానరాని దృశ్యమును. ॥మనసా॥

– నరేంద్రుడు (స్వామి వివేకానన్ద)



సద్గురు సందేశము

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

నిర్మల హృదయముతో దైవభావన చేయువారు ప్రాపంచిక విషయములలో ఎక్కువ ప్రవృత్తి గలిగియుండరాదు. వారి హృదయము ఎల్లప్పుడును ప్రశాంతముగాను, ఏలాటి భారము లేనిదిగా నుండవలయును. అట్టిన మాత్రమే వారు దైవలోకములో (ఆత్మ లోకములో) పనిచేయుటకు గాని, దైవ ధర్మములను కనుగొని లోకమునకు తెలుపుటకుగాని శక్తిగలవారు అగుదురు. సుసూక్ష్మ విషయములను కనిపెట్టెడి యంత్రములో భారమైన బరువును పెట్టినచో ఏలాగున ఆ యంత్రము పనిచేయజాలదో, లేక చెడిపోవునో ఆలాగున సూక్ష్మమైన దైవరహస్యమును కనుగొనుటకు ప్రశాన్త ప్రసన్న హృదయమును కలిగియుండవలయును. ఇది వారి వారి హృదయానుభవము చేతనే తెలుసుకొనదగును. దీనివలన సోమరులై ఏ కార్యమునున్ను చేయకయుండవలెనని అర్థము కాదు.

* * * *

ఏకాంతమందును, లేక మనోహరమగు స్థలమందును, కొండగుహ యందును, పుణ్యభూమియందును, దోమలు మొదలగు వానిచే బాధలు లేనిచోట యందును, దేవాలయములందును, సిద్ధక్షేత్రమందును, పుణ్యతీర్థ మందును ధ్యానము చేయువారికి శీఘ్రముగా ధ్యానసిద్ధి కలుగును. పైన తెలిపిన స్థలములలో ఏదేని ఒక స్థలమందు సిద్ధాసనమునందు కూర్చొని శిరస్సు, మెడ, శరీరమును చక్కగా నిలిపి ఏకాగ్రచిత్తంతో ధ్యానము చేయవలెను.

* * * *

మెత్తని ఆసనమందు కూర్చొని ఇంద్రియవృత్తులను నిశ్చలము చేసి

మనస్సు లీనమగు పర్యంతము ఓంకారమును పరమాత్మ పరముగా భావన చేసి ధ్యానము చేయువలయును.

*　　*　　*　　*

ఏకాంత పవిత్రస్థలమందు స్థిరాసనంలో కూర్చొని మనస్సును పరమాత్మయందు లగ్నము చేసి బ్రహ్మ భావనతో జపమాలను గ్రహించి ప్రణవార్థమగు బ్రహ్మమును తదేకధ్యానంతో గూడినవాడై ప్రయత్న పూర్వకంగా ప్రణవ మంత్రమును దినమొక్కటికి పన్నెండు వేలు జపము చేయువలయును.

*　　*　　*　　*

ఓంకారము సప్తకోటి మహామంత్రములలో ఉత్తమోత్తమము. ఓంకార ధ్యానముచే మూలాధారమునుండి సహస్రారము వరకు తదేక రూపముగా యుండును.

*　　*　　*　　*

మంత్రమునకు ఋషి, ఛందస్సు, దేవత, బీజము, శక్తి, కీలకము, అంగన్యాస కరన్యాసములు మొదలగునవి గలవు. ఇందు ఋషి, ఛందస్సు, దేవత తప్పకయుండవలయును. ఇది జ్ఞానకాండ సమ్మతము. ఇతరములు కర్మకాండలో చేరినవి. బ్రహ్మనిష్ఠుడగు గురుముఖమునుండి ఉపదేశింపబడిన మంత్రము ప్రకాశమానమై శక్తి గల్గియుండును.

త్రినేత్ర వైద్యాలయం ఆశ్రమ కంటి ఆసుపత్రి మూలనిధికి ఈక్రింది వారు పైకం పంపినారు

1. వాలకొండ ప్రభులింగం మఱియు వారి భార్య సౌభాగ్యమ్మగార్లు (రవీంద్రనగర్, మహబూబ్‌నగర్) (ఒక లక్ష)- రూ. 1,00,000/-
2. పి.కృష్ణమూర్తి గారు (ఆదిలాబాద్) - రూ. 1,00,000/-
3. శ్రీమతి ఎన్.ఆదిలక్ష్మమ్మ (లక్ష్మీనారాయణ భార్య) - రూ. 10,000/- (ఒంగోలు) వీరందరిని భగవంతుడనుగ్రహించు గాక !

శ్రీ గురుగ్రంథ సాహిబ

(ఈ "గురుగ్రంథ సాహిబ" సత్పురుషుల అమూల్యోపదేశాల సంకలనము. శిఖ్ఖుల 5వ గురువైన శ్రీ అర్జున్ మాల్ గారు తమ పూర్వజులగు సద్గురుపుల వాక్కులను - ఉపదేశాలను ఈ 'గురుగ్రంథ సాహిబ" రూపంలో సంకలనం చేశారు. శిఖ్ఖులకు అతి పవిత్ర గ్రంథమిదే. అందులోని కొన్నిటిని ఈక్రింద పొందుపరస్తున్నాము సం॥)

1. ఓం సతినాము కరతా పురఖు నిరభవు నిరవైరు

అకాల మూరతి అజూనీ సైభం గురు ప్రసాది.

తా ॥ సత్యనామం ఈశ్వరుడు ఏకము (రెండవది లేనివాడు), సృష్టికర్త, నిర్భయుడు, నిర్వైరుడు (అతనికి శత్రువు లెవరూ లేరు). కాలాతీతుడు (భూత, భవిష్యత్, వర్తమానాలకు అతీతుడు). కావున నిత్యుడు, జన్మరహితుడు స్వయంభూ అట్టి అతను సద్గురు కృపచేతనే లభిస్తాడు.

ఇది గురు మతానికి మూలమంత్రము. పూజ్య గురునానక్ వారు ఇందు పరమాత్మను శబ్దంతో ప్రస్తుతించడానికి ప్రయాసపడ్డాడు. ఆయన మతంలో పరమాత్మ నిర్గుణము. అందుచే ఆయనను వర్ణించలేము. అయినప్పటికీ ఆయన వ్యాపకత్వాన్ని, అన్నింటి అతీత్వాన్ని తెలుపడానికి కొన్ని శబ్దాలను ఈ మంత్రంలో ఉపయోగించక తప్పలేదు.

2. ఆది సచు జుగాది సచు... నానక లిఖిఅ నాలి॥

తా ॥ ఆ ప్రభువే ఏకమాత్ర సత్యస్వరూపుడు. ఎపుడేమీ (సృష్టి) లేదో అప్పుడూ ఆతని సత్తా వుండినది. నాల్గు యుగాలకు ముందున్న ఆ సత్య స్వరూప పరమాత్మ వుండియుండెను. నేడున్ను ఉన్నాడు. భవిష్యత్తులో కూడ

ఆతడుండును. మనో నిర్మలతచేతనే జ్ఞానం లభిస్తుంది. సృష్టిలోని వైకుంఠం, ఇంద్రలోకంలోని అన్ని వైభవాలు లభించినా తృష్ణ శమించదు. మానవుని వద్ద అసంఖ్యాక బౌద్ధిక తర్కాలున్నా పరమాత్మ మార్గంలో ఒకడైనా సహాయోగి లేనిచో సంసారి ఏవిధంగా సత్యపథంలో నడువగలడు ? పయనించజాలడు. ఆ పరిస్థితిలో మాయయొక్క ఆపదలు ఎట్లు తొలగిపోగలవు? కాబట్టి గురునానక్ అంటాడు జీవుడు పరమాత్మయొక్క ఆజ్ఞలో వుండాలి. తన ప్రారబ్ధకర్మ ననుసరించి అనుభవించాలి. కావున సుఖదుఃఖాలకు అతీతంగా వుండడానికి ప్రయత్నించాలి. అట్లు చేయుట వలన తృష్ణ తొలగడానికి వీలుంది. - అని .

3. సాచా సాహిబు సాచు... నానక ఏవై జాణిఏ సభు ఆపే సచి ఆరు ॥

తా ॥ పరమాత్మ అందరికీ స్వామి. అతడు పరమ సత్యము.అతని నామమున్ను అంతటి సత్యమే. ఎవరికి ప్రభువుపై అపార ప్రేమయుండునో, ఎవరు నామి (పరమాత్మ) యొక్క జ్ఞానాన్ని పొందిరో అట్టి ప్రభునామానికి వ్యాఖ్య చేయువారు మహాపురుషులు. పరమాత్మనుండి అందరూ సహాయాన్ని కోరుతారు. మఱియు అతడున్ను జీవులకు వారి కర్మానుసారం యథోచితంగా అందరికి ఇచ్చుచున్నాడు. అట్టి ప్రభువుకు దేనిని అర్పిద్దాము? మనము ప్రభువుకు సమర్పించే దానిచేత అతడు మనకు దర్శనమునిచ్చి మనలను కృతార్థులను చేయునో, దేనివలన అతడు మనలను ప్రేమించునో అట్టి అతని యశస్సును మనం గానం చేద్దాము. అమృత సమయంలో (ప్రభాతవేళ) ఆ ప్రభువుయొక్క సత్యనామాన్ని జపంచేయడం మఱియు ఆతని మహత్తునెఱింగి దాని విశదగానం చేయుటచే ఈశ్వరుని ప్రేమ లభిస్తుంది. వివిధ కర్మల కారణంచే ఆత్మ విభిన్న శరీరాలను ధరిస్తుంది.మోక్షం కేవలం ఆ ప్రభువు దయచేతనే

సంభవము. కావున దేనివలన అతని సర్వవ్యాపకతయందు, సర్వ కర్తృత్వమునందు విశ్వాసం జాగృతమగునో అట్టి సర్వసంశయాలు నశించునట్టి జ్ఞానాన్ని పొందుము - అని గురుపు చెప్పుచున్నాడు.

3. థాపిఆ న జాఇ కీతా న హోఇ....।

సభనా జీఆ కా ఇకు దాతా సో మై విసరి న జాయీ ॥

తా ॥ ఆ పరమాత్మను ఎవరూ స్థాపించలేరు. ఎవరి ద్వారాను ఆ పరమాత్మ ఉత్పన్నం కాలేదు. అతడు నిరంజనుడు. అనగా మాయాతీతుడు, స్వయం సిద్ధుడు, అనాది, అనంతుడు. “ఏ సజ్జనులు అతనిని సేవించిరో వారికి నిత్యం సమ్మానము లభించుచున్నది” అని భావించి ఆ గుణనిధి పరమాత్మను భజించాలి.

ప్రభు భజనను పాడడం, వినడం మనస్సులో ప్రేమ భావనను కల్గించుటలో నిహితము. దీనిచే సంసార దుఃఖముల నాశము మఱియు సుఖోపలబ్ధి గలుగును. జీవుడు ఆనందంలో సంచరిస్తాడు. నిజమైన శిష్యుడు గురుముఖంనుండి వెలువడే శబ్దం ద్వారా ఎపుడు పరమాత్మను తెలుసుకొంటాడో అపుడతడు ఆ పరమాత్మలోనే లయమవుతాడు. అంటే ప్రభువుకు అతనికి అభేదం కల్గుతుంది.

గురువు గొప్ప పెద్దశక్తి. గురువులో (శివ విష్ణ్వాది) అందరి గుణాలు వున్నవి. అతడు శివరూపంలో శిష్యులకు శుభం చేస్తాడు. విష్ణురూపంలో శుభగుణాలను పాలిస్తాడు. బ్రహ్మరూపంలో ఆ గుణాలను సృష్టిస్తాడు. అట్లే పార్వతివలె అవగుణాలను నాశనం చేస్తాడు. లక్ష్మి వలె దైవ సంపద నిస్తాడు. సరస్వతివలె జ్ఞానాన్నిస్తాడు. అట్టి గురువు యొక్క గుణాలను చెప్పుటకు నేను అసమర్థుడను.

" ప్రపంచంలోని సర్వ ప్రాణులకు ఒకడే యజమాని -ప్రభువు అతనిని ఎప్పుడూ విస్మరించవద్దు"- అనే సలహాను గురువు నాకు చేశాడు.

4. హరినాము లేహూ మాతా లేహూ ఆగై చిఖను పంథు భై అన ।
...నానకు కహై సునిరే మనా కరి కీరతను హోఇ ఉధారు (4-1-158)

తా ॥ ఓ మిత్రుడా పరమాత్మ నామాన్ని స్మరించు. ఏ జీవన మార్గంపై నీవు పోతున్నావో ఆ మార్గము కుటిలమైనది. మఱియు కఠినమైనది. ఓ మిత్రుడా! పరమాత్మ నామాన్ని స్మరిస్తూ ఎల్లప్పుడూ ధ్యానిస్తూ వుండు. మృత్యువు సదా నిన్ను వెన్నంటియే వుంది. ఓ సోదరా! ఏది మృత్యువు వలలో చిక్కుకునేట్లు చేస్తుందో ఆ మోహజాలము (మోహమనే వల) గురుశరణు చేత తెగిపోతుంది. శివపురి, బ్రహ్మపురి, ఇన్ద్రపురి వీనిలో ఏ స్థానమున్ను స్థిరమైనది గాదు. పరమాత్మస్మరణ చేయకుండా ఎచటనూ ఎలాటి ఆత్మానందం లభించదు. ఓ సోదరా! పరమాత్మనుండి ఎడబాసిన మానవుడు జన్మ మరణరూప చక్రంలో పడివుంటాడు. ఏవిధంగా గురువు నాకు ఉపదేశించాడో నేను ఆవిధంగా ఉచ్చైః స్వరంతో చెప్పినాను. నానక్ చెప్పుచున్నాడు ఓ నా మనస్సా ! విను -పరమాత్మను కీర్తిస్తూ వుండు. ఆ సంకీర్తనవలన జనన మరణరూప చక్రంనుండి రక్షింపబడతావు.

సద్గురు సర్వ సేవా నిధికి ఈక్రిందివారు పైకం పంపినారు

1. పైనీడి భాస్కరరావు (వాలేటి వారిపాలెం) - రూ. 101116/-
   (ఒక లక్షా వెయ్యిన్ని నూటపదహారు)
2. బి.రాధాకృష్ణయ్య (రిటైర్డు జడ్జి) గారి ద్వారా - రూ. 15000/-
   దా ॥ శివసుబ్రహ్మణ్యం
3. బి. బాలసుబ్రహ్మణ్యం (అన్న గారి ద్వారా) - రూ. 15000/-

సాధన పంచకమ్

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

(గత సంచిక తరువాయి)

తత్వమసి మహావాక్యో పదేశముచే గలుగు అనుభవమే 'అహంబ్రహ్మాస్మి' (నేను బ్రహ్మమును) అను జ్ఞానము కలుగును. 'అహం బ్రహ్మాస్మి' = (నేను బ్రహ్మము) అనేది ఒక మహావాక్యము.

'అహం బ్రహ్మాస్మి' అనునది యజుర్వేదముయొక్క బృహదారణ్యకోపనిషత్తు నందు గల మహావాక్యము. దీనినే అనుభవ వాక్యమందురు.

శరీరం నేను కాదు. ఇంద్రియములు, మనస్సు,బుద్ధి నేను కాను. అంతఃకరణ చతుష్టయమునకు సాక్షినైన సచ్చిదానంద స్వరూపమునైన పరబ్రహ్మమునే నేను అని మననం చేయవలెను.

'అయమాత్మా బ్రహ్మ' ఇది అథర్వణవేదముయొక్క మాండూక్యోపనిషత్తులోని సాక్షాత్కార వాక్యము. అయమాత్మా - ఈ శరీరము నందు అంతఃకరణములో ప్రతిఫలించిన చైతన్యము అనగా అంతఃకరణావచ్ఛిన్న చైతన్యమును జీవాత్మ అని అందురు, మరియు చిదాభాసుడందురు. ఇటువంటి జీవుడు సర్వ వ్యాపకమైన బ్రహ్మకంటే భిన్నుడు కాదు. జీవుడు బ్రహ్మమే. అంతఃకరణోపాధి వలన జీవుడని పేరు వచ్చినది.'నేను బ్రహ్మమే కాని వేరు కాను' అని ప్రత్యక్షముగా బుద్ధి యందు గోచరించును గాన అయమాత్మాబ్రహ్మ యనేది సాక్షాత్కార వాక్యమందురు. సద్గురూపదేశమువలన శిష్యునికి స్వాత్మానుభవము గల్గిన తదుపరి ఈ సమస్త జీవులును పరబ్రహ్మస్వరూపులేనని యద్వితీయ బ్రహ్మసాక్షాత్కారము గలుగును.

'ప్రజ్ఞానం బ్రహ్మ' అనునది ఋగ్వేదముయొక్క ఐతరేయోపనిషత్తు

నందు గల మహావాక్యము. దీనినే లక్షణ వాక్యమందురు.

పంచ జ్ఞానేంద్రియముల ద్వారా నేత్రములు, చెవులు, ముక్కులు, చర్మము నాలుక వీని ద్వారా రూపాది విషయములను గ్రహించుచూ, ఆయా జ్ఞానములను పొందుచున్నాడో ఆ తెలివినే - బ్రహ్మమందురు.

మానవుడు చక్షువు ద్వారా బహిర్గతమై, అంతఃకరణ వృత్తితో యుక్తమైనట్టి ఏ చైతన్యము చేత ఎరుపు, నలుపు, తెలుపు మొదలగు రూపముల చూచి ఆయా విశేష జ్ఞానమును పొందుచున్నాడో, ఆ విధముగానే శ్రోత్రము (చెవులు) ద్వారా శబ్దములను, వినుచున్నాడో ముక్కు ద్వారా వివిధ గంధముల నాఘ్రాణించుచున్నాడో, చర్మము ద్వారా శీత, ఉష్ణ, గట్టి మెత్తని ఈవిధమైన స్పర్శ జ్ఞానమును పొందుచున్నాడో, నాలుక ద్వారా పులుపు, తీపు, చేదు మొదలగు రుచులను గ్రహించుచున్నాడో అట్టి అంతఃకరణ వృత్తి ద్వారా సకలేంద్రియముల ద్వారా వెలుపటికి (బయటకు) వ్యాపించిన చైతన్యము ప్రజ్ఞానమనబడుచున్నది. ప్రజ్ఞానమేవ బ్రహ్మ - బ్రహ్మమే ప్రజ్ఞానము, ప్రజ్ఞానమే బ్రహ్మము. ఈ చైతన్యము పిపీలికాది బ్రహ్మ పర్యంతము వ్యాపించి యున్నది. దేవ, మనుష్య, పశ్వాదులయందు వ్యాపించి యున్న చైతన్య మొక్కటియే బ్రహ్మమగును. నాయందు విద్యమాన ప్రజ్ఞానమున్నూ బ్రహ్మమే యగును. ఈ విధముగా జీవబ్రహ్మలయొక్క స్వరూపమును ప్రతిపాదించుచున్నదీ మహావాక్యము.

సాధన పంచకము - 3వ శ్లోకములో రెండవ సాధన :

శృతి శిరః పక్షస్సమాశ్రీయతామ్ ।

ఉపనిషత్తుల యొక్క అభిప్రాయము బాగుగా నాశ్రయింపబడవలెను. ఉపనిషత్తుల భావములను బాగుగా తెలిసికొని వాటిని అనుష్ఠానములో పెట్టుకోవలెనని భావము.

మానవ మాత్రునకు ప్రమాణ గ్రంథము వేదము. వేద విషయములను

బాగుగా తెలిసికొని వాటిని ఆచరణలో పెట్టుకొనుటే మానవ కర్తవ్యము. "యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామ.కారతః । న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాంగతిమ్"॥ అని గీత 16-23. శాస్త్రము విధి వాక్యము. ప్రతిషేధ వాక్యములను చెప్పును. 'సత్యంవద, ధర్మంచర' అనే విధి వాక్యములను, 'మాహింస్యా త్సర్వాభూతాని' ఏ ప్రాణికి ఏ సమయము లోనైనను, ఏ విధముగానైనను కష్టమును గలిగింపకుము అనే నిషేధ వాక్యములను ఏ మనుష్యుడు అనాదరణ చేసి ఆచరింపడో, తన ఇష్ట ప్రకారముగా ఎవడు నడచుకొనుచున్నాడో, వానికి పురుషార్థ ప్రాప్తి యోగ్యమగు తత్వజ్ఞానము గాని, ఇహలోక సౌఖ్యము గాని, స్వర్గముగాని, మోక్షముగాని యేదియును లభింపదు. కావున గీతలో "తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ । జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తుమిహార్హసి"॥ (16-24) అన్నారు. ఇది చేయుము, ఇది చేయకుమని శాసించునదగుటచే దీనికి శాస్త్రమని పేరు వచ్చినది. కనుక వేదమే మనకు ప్రమాణము. ఇటువంటి శాస్త్రము నందు చెప్పబడిన దాని నెరింగి ఈ ప్రపంచమునందు కర్మ చేయుట కర్హుడవై యున్నావు అని శ్రీకృష్ణపరమాత్మ చెప్పెను. మానవులలో గాని, దేవతలలో గాని పరమ పురుషార్థమైన మోక్షమును పొందవలెనని కోరిక గల ప్రతివారును శృతి శిరః పక్షమైన ఉపనిషత్తుల నాశ్రయించవలెను. సద్గురు ముఖముగా ఉపనిషత్తులను శ్రవణము చేయవలెను. సద్గురువు నాశ్రయించని వారు స్వయముగా చదువుకొనవలెను. ప్రజ్ఞావంతుల ద్వారా సందేహములను తీర్చుకొనవలెను.

ఉపనిషత్తులు ఏమి చెప్పుచున్నవనిన "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' "సదేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్" "అయమాత్మా బ్రహ్మ సర్వానుభూః" "బ్రహ్మ విదాప్నోతి పరమ్" ' బ్రహ్మ విద్ బ్రహ్మైవ భవతి" 'త్రికాలాబాధ్యత్వం సత్యత్వం" మూడు కాలములలో నాశరహితమైన

సత్య స్వరూపమే. బ్రహ్మమని, ప్రజ్ఞానమే బ్రహ్మమని, దేశ, కాల, వస్తువులచే పరిమితము కాని అనంత స్వరూపమే బ్రహ్మమని, నామరూపాత్మక జగత్తంతా బ్రహ్మమేనని, ఆ బ్రహ్మము కంటే అన్యమైనది ఏకించిత్ లేదని. సర్వం ఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తికించన యని, సజాతీయ విజాతీయ స్వగత భేదములేనిదని అటువంటి బ్రహ్మమును శాస్త్రము ద్వారా, గురువులు, ప్రాజ్ఞులు ద్వారా తెలిసికొని దృఢాపరోక్ష జ్ఞానమును పొందినవాడు సాక్షాత్ పరబ్రహ్మమేయని, జీవ బ్రహ్మలకు భేదం లేదని, నేనే ఆ బ్రహ్మము, సర్వవ్యాపకమైన బ్రహ్మమేనేనని అభేద జ్ఞానమును బోధించునవి ఉపనిషత్తులు. కనుక ఉపనిషత్తుల పక్షమునే ఆశ్రయించమని ఆచార్యుల వారు ఈ పదునెనిమిదవ సాధనను తెలిపిరి.

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

1. డా॥ రవీంద్రరెడ్డి ఎం.పి. (చిత్తూరు)	-	రూ. 2000/-
2. సి.సారంగపాణి (గాంధీనగర్), హైద్రాబాద్	-	రూ. 2000/-
3. నేమాని సుబ్బారావు (సామర్లకోట) అయోధ్యాపురం	-	రూ. 1500/-
4. ఎ.సాయి ప్రసాదరావు (మచిలీపట్నం)	-	రూ. 2000/-
5. విక్రమ్ (పెద్ద అంబరపేట)	-	రూ. 2000/-
6. పవనకుమార్ పేరి (బెంగుళూరు)	-	రూ. 2000/-
7. ఉదయభాస్కర్ (బెంగుళూరు)	-	రూ. 5000/-
8. జి.కృష్ణ చౌదరి (అప్పికట్ల)	-	రూ. 2000/-
9. బి.ఎన్.రామచంద్రప్ప (బెంగుళూరు)	-	రూ. 2000/-
10. డి.సుబ్బారావు (తాడేపల్లి)	-	రూ. 1500/-
11. వి.దేవేంద్రప్ప (బళ్ళారి)	-	రూ. 1500/-
12. పొన్నాడ రామారావు (ఉల్లంపట్లు)	-	రూ. 1500/-
13. పి.శ్రీనివాసరావు (మచిలీపట్నం)	-	రూ. 1500/-

మాయ

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

"మాయ" అనే శబ్దాన్ని వాడని హిందూ మతస్థులు వుండరు. ఊహించని కష్టాలు, నష్టాలు, సమస్యలు ఎదురైనప్పుడూ, చెయ్యాల్సిన దేన్నైనా తెలిసి కూడా ఆ విధంగా చెయ్యలేకపోయినప్పుడు అంతా మాయగా వుంది అని సాధారణంగా అనుకుంటూ వుంటారు.

"ఋతే ఽర్థం యత్ప్రతీయేత న ప్రతీయేత ఆత్మని

తద్విద్యా దాత్మనోమాయాం యథా భాసో యథా తమః"

అని మాయను గురించి శ్రీమద్భాగవత మహాపురాణంలో బ్రహ్మదేవుడు నారదుడికి ఉపదేశించాడు. దీని అర్థము - ఆత్మలో లేనటువంటి వస్తువును ఉన్నట్లుగా కనిపించ జేసేదే ఆత్మ యొక్క మాయ అని. రహదార్లలోను, ఎడారి ప్రదేశాలలోను మిట్ట మధ్యాహ్నం సమయంలో దూరంగా నీరు ఏ మాత్రము లేకపోయినా అక్కడ చాలా నీరు వున్నట్టు (ఎండమావులు), తాడు పూలదండ ఇత్యాదులను మసక చీకటిలో పాములుగాను, ఈనాడైతే అందరూ నిత్యము చూసే సినిమాలలో, టి.వి. ప్రదర్శనలలో దర్శించబడే పెళ్ళిళ్ళూ, కలహాలు, యుద్ధాలు, వరదలు మొదలైన శుభాశుభ సన్నివేశాలు ఏ మాత్రము యథార్థము కానివైనా, నిజంగా ఆవిధంగా జరుగుతున్నాయి అనే భావనే మాయ.

ఇక కంటిలో పొరలు కలవారికి, తమ చుట్టూ అనేకమైన వస్తువులు వ్యక్తులు వున్నా గూడా, అవేవీ కనబడవు. వస్తుజ్ఞానము లేనివారికి గూడా వస్తువు తమ ఎదటనే వున్నాగూడా అది లేదనే భావనే వుంటుంది.

ఈవిధంగా లేని వస్తువును వున్నట్టూ, వున్న వస్తువును లేనట్టూ భావన కలిగించేదే 'మాయ' అని చెప్పబడింది.

"ఏకమేవా ద్వితీయం, నేహనానాస్తి కించన" ఇత్యాది శ్రుతి వాక్యాలు. మయా తతమిదం సర్వం, మత్తః పరతరం నాన్యత్ కించి దస్తి..." అనే స్మృతి వాక్యాలు ఆత్మ కన్నా ఇతరమైనది ఏ కొంచెము గూడా లేదు అని తెలుపుతున్నాయి. మరి ఈ మాయ అన్నది ఏమిటి? ఎక్కడి నుంచి వచ్చింది? దీనికి ఆధారమేది? అన్న ప్రశ్నలు కలుగుతాయి. మాయ, భ్రమ, అజ్ఞానము, అవిద్య అనే శబ్దాలు దాదాపు సమానార్థం కలవి.

అగ్ని దానియొక్క శక్తి ఐన వేడి అన్నది రెండుగా సామాన్యుడి చేత భావించబడుతున్నా యథార్థానికి వున్నది అగ్ని ఒక్కటే. అగ్నిని విడిచి వేడి, లేక వేడి లేని అగ్ని అన్నవి వుండలేవు. ఆ విధంగానే ఆత్మ దాని శక్తి ఐన మాయ రెండుగా అజ్ఞాని చేత భావించబడుతున్నాయి, గానీ వున్నది ఆత్మ ఒక్కటే. వస్తువు కనబడుతుంది. కానీ దాని శక్తి కంటికి కనిపించదు. ఆ శక్తి వలన జరిగే కార్యాన్ని బట్టి అది వున్నదని గుర్తించబడుతుంది. విద్యుత్తు కనబడదు కానీ దాని శక్తి వలన ఈనాడు అసంఖ్యాకమైన యంత్రాలు, ఉపకరణాలు పనులను చేస్తున్నాయి. విత్తనము, దానిలోని వృక్షంగా మారే శక్తి, నెమలిగుడ్డు, దానిలో అనేక రంగులతో అందమైన పెద్ద పక్షిలాగా మారే శక్తి పంచభూతాలు, వాటి శక్తులు, ఇటువంటి ఉదాహరణలతో వస్తువు దాని శక్తిని అర్థము చేసుకోవచ్చును.

మాయ అన్నది ఆత్మయొక్క శక్తి అని ఆత్మతత్వాన్ని తెలియని వారిని గురించే చెప్పబడింది. వారికే మాయ అనేది వున్నట్టు భావన కలుగుతుంది. తత్త్వము తెలిసిన వారికి మాయఅనేది అర్థము లేని మాట.

మాయకు ఆశ్రయము ఆత్మనే. దానికి స్వయం ప్రతిపత్తి, అంటే ఉనికి లేదు. ఐనా గూడా అది తన స్వభావంతో ఆత్మను కనబడకుండా చేస్తున్నది. ఉదాహరణకు సూర్యుడి వలన వేడికి సముద్రపు నీరు ఆవిరై

మేఘాలుగా ఏర్పడి ఆ సూర్యుడినే కనబడకుండా చేస్తున్నాయి. ఎవరికి కనబడకుండా చేస్తున్నాయి ? భూమి మీద గల మనిషికి. ఇక్కడ సూర్యుడు మేఘము, మనిషి అని మూడు అంశాలు వున్నట్టుగానే ఆత్మ, మాయ, అంతఃకరణము (మనసు) అనేవి వున్నాయి. మనసును ఆశ్రయించి చూసేవాడికి మాయ అడ్డుగా వుండి ఆత్మను కనబడకుండా చేస్తున్నది, అదే ప్రపంచరూపంగా కనబడుతున్నది. ఆత్మ స్థితిలో నిలిచిన వాడికి మాయ అడ్డు రాలేదు. గనుక అతడికి సర్వత్రా ఆత్మ మాత్రమే దర్శించ బడుతుంది. మేఘాలకు పైన, విమానంలో ఉన్న వాడికి, సూర్యుడు స్పష్టంగా కనిపిస్తాడు గదా !

మనసును ఆశ్రయించిన ప్రపంచాన్ని దర్శనము చేసేవాడే జీవుడు. ఇతడు ఆత్మ మాత్రమే, ఆనంద స్వరూపుడే కానీ, అసంఖ్యాకమైన శబ్ద స్పర్శ రూపరసగంధాత్మకమైన ప్రాపంచిక విషయ భోగాలకు ఆకర్షితుడై వాటి సంపాదనలో, అనుభవములో తదనంతర బాధలు సమస్యలతో మునిగిపోయి తృప్తి విరామము అన్నవి లేక జన్మ పరంపరలో అనేక ఉపాధులను పొందుతూ విడుస్తూ మహాక్లేశాన్ని అనుభవిస్తున్నాడు. ఇదంతా మాయ వలన కరిగిన అనర్థమే.

ఆత్మస్వరూపుడూ, ఆనందమయుడూ ఐనవాడు అసలు ఈ మాయలో ఎట్లా పడ్డాడు? అని సందేహము. "సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిః జ్ఞాన మపోహనం చ.." అని భగవద్గీతా శ్లోకంలో చెప్పినట్టు, ఆత్మలోనే ఆత్మ స్వరూపుడనే జ్ఞప్తి, సర్వమూ ఆత్మనే అనే జ్ఞానమూ ఇంకా ఈ రెంటియొక్క మరుపు వున్నాయని, తెలుస్తున్నది. ఉదాహరణకు – లోకంలో ఒక గొప్ప ధనికుడి కొడుకు ఒకానొక బలహీనత వలన ఒక నిరుపేద కూతురితో సంబంధము కలిగి, ఆమెనే తన సర్వస్వము, ఆమె లేనిది జీవించలేను అన్నంత గాఢమైన ప్రేమలో పడ్డాడు. ఐతే అతని తండ్రికి మాత్రము అది ససేమిరా ఇష్టము లేక తన మాటను

వినని కొడుకును కట్టుబట్టలతో ఇంటి నుండి వెళ్ళగొట్టాడు. యువతి మీది మోహం చేత తండ్రిని కూడా వదులుకుని వచ్చి ఆ యువతిని వివాహమాడి తరువాత కాలంలో అనేకమైన దారిద్ర్య బాధలను అనుభవించాడు ఆ అవివేకి.

అదేవిధంగా పరమాత్మ స్వరూపుడైనవాడు ఏదో ఒకనాడు తనశక్తి ఐన మాయ చేత మనసు అనే దాన్ని కల్పించి అది కల్పించిన ప్రపంచమనే దాంట్లో, అది సుఖదుఃఖాలను అనుభవిస్తూ జన్మలను పొందుతుంటే, తాను ఆ మనసుతో తాదాత్మ్యాన్ని పొంది, వాటినన్నిటినీ తానే అనుభవిస్తున్నాను అని భావిస్తున్నాడు. ఆ విధంగా మనసుతో మమేకమైన వాడికి అతడి యథార్థ స్థితిని జ్ఞాపకము చెయ్యడాని కోసమే, పరమాత్మ యందు ప్రపంచమనేది మాయ ద్వారా ఏ విధంగా కల్పించబడిందో తెలియజేస్తున్నాయి శ్రుతిస్మృతి పురాణాలు.

సముద్రము, నదులు, చెఱువులు, బావులు, కాలువలు, మంచుగడ్డలు, పొగమంచు, మేఘాలు, జలపాతాలు,సుడిగుండాలు ఇవన్నీ కేవలము ఒక్క నీరే ఐనా గూడా ఆయా రూపాలు, లక్షణాల వలన దానికి అనేక నామాలు కలిగాయి. అదేవిధంగా ప్రకృతి, మహత్తు, అహంకారము, పంచభూతాలు, ఇంద్రియాలు, ప్రాణాలు, విషయాలు, లోకాలు, దేవతలు, ఋషులు, మానవులు, జంతువులు, వీటన్నిటిలో దర్శించబడుతున్న కార్యకలాపము పరమాత్మకన్నా అన్యమైన వాటిగా దర్శించబడుతున్నాయి.

సద్గురువులను ఆశ్రయించి వారి తత్త్వబోధను బాగా గ్రహించి, పట్టుదలతో ఆ ప్రకారము సాధనను చేసి కల్పితమైన మాయ అనేది లేదని తెలుసుకుని ఆత్మ స్వరూపంలో సుస్థిరంగా ఆనందంగా ఉండటమే మానవజన్మ యొక్క ఏకైక లక్ష్యము. **ఓం తత్ సత్**

శ్రీ గురు నానక్

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య (తిరుపతి)

హిందువులు, బౌద్ధులు, జైనులు, శిక్కులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, ఇత్యాదిగా మతపరమైన భేదాలు సమాజంలో గోచరిస్తున్నాయి. ప్రజలు పాటించే మత సంప్రదాయాలను బట్టి వారినలా వ్యవహరించడం జరుగుతున్నది. భారతావనిలోని క్రైస్తవులు, మహమ్మదీయులు ఇతర దేశాలలో అవతరించిన క్రీస్తు, మహమ్మదు అనే మత ప్రవర్తకులను తమకు మార్గదర్శకులుగా విశ్వసిస్తారు.

సనాతన ధర్మాన్ని అనుసరించే వారిని హిందువులంటున్నాం. వారిలో బౌద్ధులు, జైనులు, శిక్కులు అనే భేదాలు కాలక్రమంలో ఏర్పడ్డాయి. బుద్ధుడు, మహావీరుడు, గురునానక్ - అనే మహా పురుషులు ఆ మతాలకు ప్రవర్తకులు.

సిక్కు మతానికి ఆది గురువుగా కీర్తింప బడుతున్న శ్రీ గురు నానక్‌ను గురించి ఈ వ్యాసంలో సంగ్రహంగా వివరించుకొందాం.

క్రీ.శ. 1469లో గురు నానక్ జన్మించాడు. తన అవతార లక్ష్యాలను నెరవేర్చుకొని 1539లో శరీర పరిత్యాగం చేశాడు. గురుపరంపరలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధి కెక్కాడు.

బాల్యంలోనే అతని విలక్షణమైన ప్రవర్తన ప్రజల దృష్టి నాకర్షించింది. ఏకాంతంలో కూర్చొని తరచూ తీవ్ర ధ్యాన నిమగ్నుడయ్యేవాడు. విద్యాభ్యాస కాలంలో అక్షరాలలోని రహస్యార్థం ఏమిటి అని గురువుల నడిగితే, వారు అతనికి తగిన సమాధానం చెప్పలేక పోయేవారు.

ఉపనయనకాలంలో పురోహితుడు యజ్ఞోపవీతం ధరించుమని చెప్పగా "ఇది ధరిస్తే అపవిత్ర వ్యక్తికి గూడా పాపం అంటదా?" అని ప్రశ్నించి అతణ్ణి నిరుత్తరుణ్ణి చేశాడు. "దయ అనే దూది నుండి ప్రేమ అనే దారం తీసి విరక్తి, సత్యం అనే రెండు ముళ్ళు వేసి దానిని ధరించాలి" అని నానక్ చెప్పగా అక్కడ చేరిన వారందరూ ఆశ్చర్య చకితులయ్యారు.

కొంతకాలం నానక్ ఒక నవాబు వద్ద నౌకరీ చేశాడు. ఒకనాడు ఆలస్యంగా పనికి వచ్చాడు. అతణ్ణి చూచి నవాబు కోపం ప్రదర్శించగా "అయ్యా. ఇప్పుడు నేను నీ భృత్యుడనుకాను, పరమేశ్వరుని భృత్యుణ్ణి" అని మొగమాటం లేకుండా చెప్పాడు. మరొక సందర్భంలో ఆ నవాబు "నీవు ఒక దేవుణ్ణి నమ్ముతావా? పలువురు దేవుళ్ళను నమ్ముతావా? అని ప్రశ్నించాడు. అందుకు నానక్ "నేను అదృశ్యుడు, స్వప్రతిష్ఠుడు, సర్వవ్యాపి, పూజ్యుడూ అయిన ఒకే భగవంతుణ్ణి నమ్ముతాను" అని సమాధానం చెప్పాడు. అంతటి ధీశాలి, ధైర్యశాలి శ్రీగురునానక్.

శ్రీ నానక్ బోధన విధానం ఎంతో విశిష్టంగా ఉండేది. అతడు "హిందువా? ముస్లిమా?" అన్న వివాదం కూడా ఉండేది. ఆ మహనీయుడు ఈ రెండు భేదాలకూ అతీతుడుగా జీవించాడు.

డెబ్బది యేండ్ల వయస్సులో నానక్ బ్రహ్మైక్యం చెందాడు. అప్పుడు "హిందూ సంప్రదాయానుసారంగా దహనం చేయాలా? ముస్లిం సంప్రదాయ ప్రకారం ఖననం చేయాలా? అనే వివాదం ఏర్పడింది. ఆ శరీరం మీద కప్పిన వస్త్రాన్ని తొలగించి చూడగా ఆ శరీరం అదృశ్యమై పోయింది.

శిక్కుమత సంప్రదాయంలో పది మంది గురువులు క్రమముగా (1). గురునానక్, (2). గురు అంగద్, (3). గురు అమరదాస్ (4). గురు రామదాస్ (5). గురు అర్జున్‌మాల్ (6). గురు హరగోవింద్ (7). గురు హరరాయ్ (8). గురు హరకిషన్ (9). గురు తేజ్ బహదూర్, మరియు (10). గురు గోవిందసింగ్.

ఇందులో స్వర్ణమందిరం కట్టినవారు గురు అర్జున్‌మాల్. ఈ గురువులలో అనేకులు కవులు. వారు చరించిన కీర్తనల సముచ్చయమే "ఆది గ్రంథ సాహెబ్ " ఇది ఈ గురువు గారి కాలంలో పెద్దగా ప్రచారమయింది.

శ్రీ గురుగోవిందసింగ్ తాను చివరి గురువుననీ, శిక్కుమత గ్రంథాలలో చివరిదైన "దిస్విన్ పాద్‌షాహీ" గ్రంథ సాహెబ్ చివరి భాగమనీ, గ్రంథసాహెబ్ గ్రంథమే గురుస్థానం వహిస్తుందనీ, పూజలందుకొంటుందనీ నిర్ణయించాడు. ఇప్పటికీ ఈ పద్ధతి నిరాటంకంగా కొనసాగుతున్నది.

ముఖ్య మత లక్షణాలు

సిక్కు మతం ఏకేశ్వరవాదాన్ని అంగీకరించింది. సృష్టి స్థితిలయకర్త ఈశ్వరుడే. ఆయన సర్వవ్యాపి సృష్టి సత్యమైనది. ప్రాణులలో మిక్కిలి ఉత్తమప్రాణి మానవుడు. అహంకారాన్ని తొలగించుకోవాలి. కర్మ సిద్ధాంతం, జన్మ సిద్ధాంతం విశ్వసింపదగినవి. ఈశ్వరానుగ్రహం లేకుంటే ముక్తి సిద్ధించదు. భావశుద్ధి కల్గి వుండాలి, బాహ్యాడంబరాలు తగవు.

పుట్టుకతోనే 'ఒకడు ఘనుడు, ఒకడు హీనుడు' అని హిందూ స్మృతులు ఘోషించే వర్ణ వ్యవస్థను సిక్కుమతం తీవ్రంగా నిరసించింది. ఈ మతంలో అవతారవాదం అంగీకరించబడలేదు.

ఆదిగ్రంథంలోని మొదటి మంత్రంలో ఈశ్వరుని స్వరూపం ఇలా వర్ణించబడింది.

"ఓంకార్ సత్నామ్ కరతా పురుఖ్ నిరభవ్, నిరవైర్, అకాల్, మూరత్ అజూని సైభంగ్ గురుప్రసాద్"

"తత్త్వం ఒక్కటే. అది అనంతం, అన్ని వస్తువులలోనూ వ్యాప్తమైయున్నది. అన్నిటికీ ఆధారమై యున్నది. అన్నిటినీ సృష్టించింది, సృష్టినంతటినీ వ్యాపించి యున్నది. భయం, శత్రుత్వాలు లేనిది, కాలాతీతమైనది, జన్మ మరణాతీతమైనది, తన ఆవిర్భావానికి తానే హేతువు. గురు ప్రసాదం చేత తెలియదగియున్నది".

"ఈశ్వరుడు ఒక్కడే. అతడే బ్రహ్మ, విష్ణువు, శివుడూ కూడా. అన్ని చేసేది అతడే" అన్న ఆది గ్రంథంలోని మాటల వల్ల త్రిమూర్తులను సృష్టించిన ఏకైక - ఈశ్వరుడే సిక్కు మతంలో అత్యంత ప్రధానమని గ్రహించాలి. ఈశ్వర భక్తి, గురుభక్తి ఈ మతంలో ముఖ్యాతిముఖ్యమైనవి. భగవన్నామ స్మరణకు ఇందులో ప్రాధాన్యమున్నది. 'శిష్య' అనే పదం నుండి 'సిక్కు' అనే పదం పుట్టింది. కాన గురుభక్తితో శిష్యుడు ధన్యుడు కావాలి.

భగవంతుని లీలలు ఎవరి ద్వారా అభివ్యక్తం అవుతాయో ఆతడిలో విశేష శక్తి కానవస్తుంది. జమిందారు తన జమీనులో అన్ని చోట్లకు పోతూ వుంటాడు. కాని కచ్చేరి చావడికి మాత్రం ప్రతిరోజు వచ్చి చాలాసేపు కూర్చుంటాడు. భక్తుడే భగవంతుని కచ్చేరి చావడి. భక్తుని హృదయంలో తన లీలలను ప్రదర్శింప భగవంతుడు ఇష్టపడతాడు. భక్తుని హృదయంలోనే ఆయన విశేష శక్తి వ్యక్తమవుతుంది. మహాకార్యాలు నిర్వర్తించబడేచోట్ల భగవంతుని విశేష శక్తి వ్యక్తీకరణ వుంటుంది. - శ్రీరామకృష్ణపరమహంస

త్రిమూర్తులు

- శ్రీ మధుసూదన సరస్వతి

ఈశ్వరుడు మూడు విధాలు. తనకు ఉపాధి అయిన మాయలోని సత్త్వ రజస్తమస్సులనే మూడు గుణాల హెచ్చు తగ్గులను బట్టి విష్ణు, బ్రహ్మ, రుద్రులని మూడు మూర్తులు.

కారణం అయిన సత్త్వగుణంతో కూడినవాడు విష్ణువు. పాలకుడు. కారణం అయిన రజోగుణంతో ఉన్నవాడు బ్రహ్మ. హిరణ్యగర్భుడు మహాభూతాలను సృజించలేదు. కాబట్టి అతను బ్రహ్మకాడు. అయినా స్థూలభూతాలను సృష్టించినందువలన కొన్నిచోట్ల అతనిని (హిరణ్య గర్భుని) బ్రహ్మ అంటారు. కారణమైన తమస్సునందున్న వాడు రుద్రుడు. సంహారకారకుడు.

ఇట్లు ఒక ఈశ్వరునికే చతుర్భుజ, చతుర్ముఖ, పంచముఖాలు గల పురుషాకారాలు, లక్ష్మి, భారతి, భవాని మొదలగు స్త్రీ ఆకారాలు ఏర్పడ్డాయి. ఇంకను మత్స్య, కూర్మ మొదలగు అనంతావతారాలు, లీలా వతారాలు. ఇవి భక్తానుగ్రహం మొదలగువాని కోసరం ఏర్పడ్డాయి. ఈ విషయాన్నే "చిన్మయస్యాద్వితీయస్య నిష్కలస్య అశరీరిణః ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా"- శరీరంలేని. అద్వితీయుడైన బ్రహ్మమునకు భక్తుల ఉపాసన కోసరం రూపకల్పన చేయబడింది"అని శ్రుతి పేర్కొన్నది. "యో హ ఖలు వావాస్య రాజ సాంశోసౌ సయో ఽ యం బ్రహ్మ. యోహఖలు వావాస్య తామసాంశోసౌ సయోయం రుద్రః. యోహఖలు వావాస్య సాత్త్వికాంశోసౌ సయోయం విష్ణుః" అని మైత్రేయోపనిషత్తు త్రిగుణాలను బట్టి త్రిమూర్తులు అని తెలిపినది. (మధుసూదనుని సిద్ధాన్తబిన్దు నుండి)

పౌరాణిక సూక్తులు

- ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

ప్రపంచంలో 84 లక్షల జీవరాసులున్నాయని పెద్దలంటారు. ఆ జీవరాసులలో మానవుడు అహంకారం వల్ల అజ్ఞానం వల్ల అనేక రకాలయిన వ్యసనాల వల్ల దుర్మార్గుడవుతున్నాడు. మెట్టుపై మెట్టు ఎక్కిన మానవుడు. భగవంతుని చేరబోతుండగా ఒక్కసారి పతనమవుతున్నాడు. ఇలాంటి వారు బాగుపడడానికే మన కవులు సమాజానికి ఎన్నో నీతులు చెప్పారు. అలాంటి నీతులు చెప్పే గ్రంథాలలో పురాణాలు ప్రసిద్ధాలు.

వేదాలను ప్రభు సమ్మితాలుగా, కావ్యాలను కాంతాసమ్మితాలుగా చెప్పిన అలంకారికులు పురాణాలను మిత్ర సమ్మితాలన్నారు. ఒక స్నేహితుడు చెడిపోతుంటే అతనికి దగ్గరి వాడయిన మరో మిత్రుడు సలహాలిచ్చి సరిదిద్దడానికి ప్రయత్నించినట్లే పురాణాలు కథలద్వారా, నీతి ఉపదేశాల ద్వారా సమాజానికి మార్గదర్శకాలుగా ఉన్నాయి. అలాంటి పురాణాలు 18. ఈ పురాణాలు వ్రాసిన వాడు వేదవ్యాసుడు. ఇలాంటి పురాణాలలోని కొన్ని అంశాలను చెప్పడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

పురాణాలలో గరుడ పురాణం ఒకటి. ఈ పురాణం చాల నూతనాంశాలను వివరించింది. మచ్చుకు కొన్ని

అగ్ర కులాలవారు కొన్ని కులాలవారిని చాల తక్కువగా చూస్తారు. తామే గొప్ప అని అహంకరిస్తుంటారు. అలాంటి వారికి చురక వేసే శ్లోకం.

కస్య దోషః కులే నాస్తి వ్యాధినా కో న పీడితః

కేన న వ్యసనం ప్రాప్తం శ్రియః కస్య నిరస్తరాః.

తక్కువ కులంలో పుట్టడమే నేరం కాదు. వ్యాధు లెవరికయినా వస్తాయి. కష్టాలు అలాగే. ఏదీ శాశ్వతం కాదని భావార్థం.

పురాణాలలో చాల ప్రసిద్ధమయినది వామనపురాణం. ఈ పురాణంలో చిత్రమయిన ఒక అంశం ప్రస్తావితం.

ఇలావృతమనే దేశం. ఆ దేశాన్ని శ్వేతుడనే రాజు పరిపాలిస్తున్నాడు. అతడు తన రాజ్యంలోని ప్రజలకు ఏదయినా దానం చేయాలనుకొన్నాడు. కులగురువు వసిష్ఠుని సంప్రతించాడు. కులగురువు అన్నదానం చేయమన్నాడు.

అన్నదానం దదత్ రాజన్ సర్వలోక సుఖావహమ్

సర్వేషామేవ దానానాం అన్నదానం విశిష్యతే ॥ అన్నాడు.

చిరంజీవులలో మార్కండేయుడు ఒకడు. అతని పేర గల పురాణం మార్కండేయ పురాణం. ఈ పురాణంలో కొడుకుల గురించి చక్కటి విశ్లేషణ ఉంది. కొడుకులు మూడు రకాల వారు

తండ్రి సంపాదించిన కీర్తి, ధనాలే గాక స్వశక్తితో మరింత ఆ సంపదలను రెట్టింపు చేసేవాడు ఉత్తముడు.

తండ్రి సంపాదించిన కీర్తి. ధనం, పరాక్రమం. వీటిని నిలుపు కొంటూ జీవించేవాడు మధ్యముడు.

తండ్రి తాలూకు సంపదలను నానాటికి నాశనం చేసేవాడు అధముడు.

యః పిత్రా సముపాత్తాని ధనవీర్య యశాంసి వై

న్యూనతాం నయతి ప్రాజ్ఞః   తమాహుః పురుషాధమమ్.

చాలా పురాణాలు కలియుగ లక్షణాలను విశదం చేస్తాయి. ఇవన్నీ నేడు ప్రత్యక్షంగా మనకు కనిపిస్తున్నాయి. పౌరాణికుల దూరదృష్టికి చేతులు జోడించవలసిందే. వాటిలో ఒకటి.

కొందరు ఎదురుగా తియ్యగా మాటలాడతారు. పరోక్షంలో తిట్టని తిట్టు తిట్టకుండా వాగుతారు. కొందరు స్త్రీలు భర్తల ముందు ప్రేమ ఒలకపోస్తారు. చాటు పనులు చేస్తుంటారు.

పరోక్ష నిందకాః క్రూరాః   సమ్ముఖే ప్రియవాదినః
సాధ్వీవాదం వదిష్యన్తి   భర్తారం పుంశ్చలీ స్త్రియః.

శ్రీ మద్రామాయణంలో శ్రీరాముడు 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్నట్లు ఒక వాక్యం. జంధ్యాల పాపయ్య శాస్త్రి పరమ పావనంబు పంచ జకారంబు అన్నారు. జనని, జనకుడు, జన్మభూమి, జాహ్నవి, జాతీయ పతాకం. బ్రహ్మపురాణం ఏనాడో ఈ అంశాన్ని స్పష్టం చేసింది.

పృథివ్యాం భారతం వర్షం   దండకం తత్ర పుణ్యదం
తీర్థానాం గౌతమి గంగా   శ్రేష్ఠా ముక్తిప్రదా నృణామ్.

పురాణాలను పుక్కిటి పురాణాలనడం అజ్ఞానుల లక్షణం

ఆధారం : పురాణ పరిచయం.

గీతా జయన్తి

డిసెంబరు 25వ తేది శుక్రవారం గీతా జయన్తి. శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో కార్యక్రమం జరుగును. తిరుపతి శ్రీమలయాళ సద్గురు సేవా సమాజ వార్షికోత్సవం గీతాజయన్తి నాడు జరుగును.

దశావతార స్ఫూర్తి

- **శ్రీమతి ఆర్. శోభాదేవి (హైద్రాబాద్)**

మత్స్యావతార ఆవిర్భావం :

పూర్వం సత్యవ్రతుడనే రాజర్షి నియతాహారుడై తపస్సు చేస్తుండేవాడు. ఒకనాడు సత్యవ్రతుడు కృతమాలా నదిలో స్నానాదికాలు ముగించి తర్పణాలిస్తున్నాడు. అతని దోసిలిలో అద్భుతంగా ఒక చిన్న చేప పిల్ల. చేపపిల్లను గమనించిన రాజు దాన్ని నదిలో వదిలేయ బోయాడు. అది భయంతో "నదిలోని జలజంతువులనుండి నన్ను రక్షించు" అని దీనంగా పలికింది. జాలి గలిగి రాజు తన కమండలంలో వుంచి ఆశ్రమానికి తెచ్చాడు. విశాలంగా వుంటుందని పెద్ద మట్టి పాత్రలోనికి మార్చాడు. పెరిగిపోయిన చేప మరో చోటికి మార్చమంది. సరోవరంలోకి మార్చాడు రాజు. ఆశ్చర్యంగా అది పెరిగిపోయి తనకు విశాలమైన చోటు చూపమంది. ఎక్కడా దానికి చోటు సరిపోనందు వలన రాజు చివరకు సముద్ర జలాలలో వదిలాడు. "సముద్రంలోని పెద్ద జలచరాలు నన్ను భక్షిస్తాయి" అంటుంది. ఆ మాటలు విన్న రాజు "మహాత్మా! మత్స్య రూపంలో వున్న మీరెవరు ? నూరుక్రోసుల దూరం విస్తరించావు. నీవు తప్పక సర్వాంతర్యామివైన శ్రీహరివే అయి వుంటావు. నేను నీకు శరణాగతుడను. నా మోహం తొలగించు స్వామీ !" అన్నాడు రాజు.

"సత్యవ్రతా ! నేటికి ఏడవ దినాన అంతా జలమయమై పోతుంది. నా సంకల్పంతో ఒక నౌక నీ సమీపానికి వస్తుంది. నీవు సమస్త ప్రాణుల సూక్ష్మ శరీరాలను, బీజాలను సేకరించి సప్త ఋషులతో కూడి నావను ఎక్కు. అంతటా చీకటి మయం. సప్త ఋషుల తేజస్సుతో నావను ఎక్కు

ప్రళయ సాగరం గాలికి అల్లకల్లోలంగా వుంటుంది. ఆందోళన చెంద నద్దు. అప్పుడు నేను మత్స్యరూపంలో అక్కడికి వస్తాను. అప్పుడు మీరు వాసుకిని తాడుగా చేసి ఆ నౌకను నా కొమ్ముకు కట్టివేయండి. బ్రహ్మదేవుని రాత్రి పూర్తయేవరకు మిమ్ములను ప్రళయ జలాలలో త్రిప్పుతుంటాను. అప్పుడు నీ ప్రశ్నలకు సమాధానాలు యిస్తాను. నా ఉపదేశాలతో నీకు పరబ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుంది' అని మత్స్య భగవానుడు అనుగ్రహించాడు.

భగవంతుడు తళతళలాడే పెద్ద మత్స్యరూపంలో సముద్రజలాలలో చరిస్తున్నాడు. ఒకసారి జలచరాలతో కలిసి తిరుగుతూ మరోమారు వేగంగా దరులకు దుముకుతూ, ఆకాశానికి ఎగురుతూ, జలంలో దాక్కుంటూ వుంటాడు. ఒకసారి చేపల గుంపును మింగుతూ రెక్కలు చాస్తూ, మీసాలు కదలిస్తూ మేనిమీది తళతళలు వెలయిస్తూ కన్నుల కాంతులతో ఒళ్ళు విరుచుకుంటూ భగవానుడు సాగర గర్భంలో విహరించాడు.

మత్స్య భగవానుని లీలా విలాసాలను తలచుకుంటూ సత్యవ్రతుడు ఆశ్రమం చేరాడు. మహారాజు స్వామి ఆదేశానుసారం ఎదురుచూస్తున్నాడు. దర్భాసనముపై ఈశాన్యముఖుడై కూర్చుని భగవంతుని చరణకమలాలపై మనసు నిలిపాడు. ప్రళయ సమయం ఆసన్నమైంది. చూస్తుండగానే వర్షంతో భూమంతా జలమయమైంది. నావ వచ్చింది. రాజు ధాన్యాలు, ఇతర బీజాలను గ్రహించి సప్తఋషులతో నావ ఎక్కాడు. భగవంతుని ధ్యానించమని సప్త ఋషులు చెప్పారు. భగవంతుడే మనలను రక్షించగలడు. "ప్రభూ ! నీవే స్వయం ప్రకాశకుడవు. మాలో అజ్ఞాన తిమిరాన్ని తొలగించే జ్ఞాన భాస్కరుడవు నీవూ ! నీ అనుగ్రహంతో మేము పవిత్రుల మౌతాము."

మత్స్య భగవానుడు ప్రళయ సముద్రంలో విహరిస్తూ సత్యవ్రతునకు

ఆత్మ తత్వాన్ని, స్వస్వరూప రహస్యాలను వివరించాడు. జ్ఞాన భక్తి యోగాలతో కూడిన పరిపూర్ణమైన 'మత్స్యపురాణము'ను ఉపదేశించాడు. సత్యవ్రత మహారాజు జ్ఞాన విజ్ఞాన ప్రాప్తిని పొంది ఈ కల్పంలో వైవస్వతమనువు అయినాడు. ప్రళయ జలాలు అంతంకాగా బ్రహ్మ నిదురలేచాడు. మత్స్య భగవానుడు హయగ్రీవాసురుని అంత మొందించి వేదాలను గ్రహించి మళ్ళీ బ్రహ్మకు అందించాడు.

అవతార రహస్యం : చరాచర సృష్టి అంతా ఆ పరబ్రహ్మమే గదా! బీజాలను సేకరించటం ఏమిటి? బ్రహ్మ నిద్రిస్తుండగా వేదాలను ఎత్తుకు పోవటం ఏమిటి? సృష్టికర్తకు అంత అజాగ్రత్త ఏమిటి? ఇలాంటివి ఎన్నో ప్రశ్నలు.

సాధారణ మానవుడు పండ్లు తింటాడు కానీ టెంకల గింజలను గూర్చి అంత శ్రద్ధ వహించడు. మళ్ళీ తోట వేయాలనుకున్న వాడే సేకరించి జాగ్రత్త చేస్తాడు. పరమాత్మ బీజాలను సేకరిస్తున్నాడు. మోక్షప్రాప్తికి ఉపయోగపడే సద్గుణాలనే బీజాలను సేకరించి పునః సృష్టి జరిగినపుడు పునర్జన్మనెత్తే ఈ జీవుని సత్ప్రవర్తనకు దోహదం చేస్తాడు పరమాత్మ.

జీవుడు ఈ శరీరాన్ని వదిలి మరొక ఉపాధిని పొందటమే యుగం ఆది. మరోయుగం ఆరంభం అవడం. జీవుడు తన వాసనలను సేకరించుకొని వెళ్ళడమే ఈ యుగంలో బీజసేకరణ. ఈ జన్మలో సేకరించిన పాప పుణ్యాలు సద్గుణ దుర్గుణ బీజాలే రెండవ జన్మలో పుష్పించి ఫలిస్తాయి. జీవునిలోని చైతన్యమే పరమాత్మ.

భగవానుడు మత్స్య రూపంలో వేదాలను ఉద్ధరించటం మరోకార్యం. హయగ్రీవుడు అశ్వం యొక్క శిరస్సు గలవాడు. అశ్వః 'రేపు' వుండనిది. నశ్వరమైనది. అంటే అసత్యము, అనిత్యము అయిన శిరస్సు గలవాడు. వానికే సోమకాసురుడనే పేరు కూడా వుంది. ప్రకృతియే సంపదగా గలవాడు.

పరమాత్మ భావనా రక్షణను నాశనం చేసే మనోవృత్తి అదే అసురభావం. భౌతిక భావం గలవాడు.

పరమాత్మను గురించిన వేదజ్ఞానాన్ని బ్రహ్మ రూపం నుండి వేరు చేసి జడంలోకి తీసుకు వెళ్ళాడు. ఆ జడం నుండి ఈశ్వర భావాన్ని వెలికితీసి పరమాత్మ తత్వాన్ని ఉద్ధరించాలి. మానవుడు అహంకార మమకారాలను వదలుకొని జ్ఞానాన్ని పొందాలి.

కృతయుగారంభంలో జలప్రళయ వేళ పునః సృష్టికొరకు పరమాత్మ మత్స్య రూపాన్ని ధరించి జీవ నిర్జీవ వస్తు సముదాయం బీజ రక్షణకు మరలా నూతన సృష్టికి అవసరమైన వేదాలను (జ్ఞానాన్ని) బ్రహ్మకు అందించటానికే అవతరించాడు.

భాగవత వాణి

గురుశుశ్రూషయా భక్త్యా సర్వలబ్ధార్పణేన చ ।
సఙ్గేన సాధుభక్తానాం ఈశ్వరారాధనేన చ ॥
శ్రద్ధయా తత్కథాయాం చ కీర్తనైర్గుణ కర్మణామ్ ।
తత్పాదామ్బురుహధ్యానాత్ తల్లిఙ్గేక్షార్హణాదిభిః ॥

తా ॥ గురువును భక్తి పూర్వకముగ సేవించుట, తనకేది లభించునో దానిని ప్రేమతో భగవంతునకు సమర్పించుట, భగవద్భక్తులగు మహాత్ములయొక్క సత్సాంగత్యము, భగవదారాధన, భగవంతుని కథల యందు వార్తలందు శ్రద్ధ, భగద్గుణములను లీలలను కీర్తించుట, భగవంతుని పాదకమలములను ధ్యానించుట, భగవన్మందిరములను విగ్రహములు మున్నగువానిని దర్శించుట - పూజించుట మొదలగు సాధనలచే భగవంతునియందు స్వాభావికమైన భక్తి కలుగుచున్నది.

(భాగవతం 7స్కంధం 93,94)



పూజ్యశ్రీ ప్రజ్ఞారణ్యస్వామీజీ

డా ॥ సముద్రాల లక్ష్మణయ్య (తిరుపతి)

'జాతస్యహి ధ్రువోమృత్యుః' అని గీతాచార్యునిమాట. శరీరమున్నవేసే జీవుడైన ఒకనాటికి ఉనికి లేనిదయ్యేది అని భావం. వారు, వీరు అనే తేడా ఏ మాత్రం లేకుండా మనిషిని సదా వెన్నంటి వుండే మృత్యువు ఒక నాటికి ఆ వ్యక్తిని కబళిస్తుంది.

అయితే పుట్టలోని చెదలు వలె పుట్టి గిట్టే వారిని గూర్చి అంతగా విచారించం. జీవితంలో తాము ఆత్మోన్నతిని సాధించి, ఇతరుల ఆత్మోన్నతికి పాటుపడే వారు కనమరుగైతే కొంత విషాదానికి లోనవుతాం.

పూజ్యశ్రీ ప్రజ్ఞారణ్య స్వాములవారు 90 సంవత్సరాల నిండు జీవితం జీవించి సాధించాలి అనుకున్నది సాధించి గత సెప్టెంబర్ 9వ తేదీన బ్రహ్మ లీనులయ్యారు. అన్నారెడ్డి పాళెంలో యోగిరామతపోవనం క్షేత్రాన్ని నిర్మించి వీరు "కో ఽహం = నేనెవరు"అన్న శ్రీరమణ మహర్షి ప్రబోధించిన జ్ఞానమార్గంలో నడిచి గమ్యం చేరారు.

'యోగి ప్రాటోప్లాజం'గా ప్రశస్తి గడించిన వీరు కొంతకాలం కళాశాలాధ్యాపకులుగా పవిత్ర జీవితం గడిపారు. విద్యార్థులలో ఆధ్యాత్మికతను పెంపొందించడానికి విశేష కృషి గావించారు. సైన్స్ క్లబ్‌లను స్థాపించి విద్యార్థులలో విజ్ఞానాన్ని వృద్ధి పొందించడానికి పాటు పడ్డారు. ఆ జన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఉద్యోగం విరమించిన పిదప సన్యసించారు. శ్రీరమణుల శిష్యులైన యోగిరామయ్య గారి పేరిట అన్నారెడ్డి పాళెంలో తపోవనం నిర్మించారు.

దేశ విదేశాలకు చెందిన సాధకులకు ఆత్మ పరిశోధనా ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. దేశంలోని పలు ఆశ్రమాలలో ఈ యోగశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బెంగుళూరులోని వివేకానంద విశ్వవిద్యాలయం వారు శ్రీరమణ మహర్షి పేరిట స్థాపించిన పీఠానికి వీరిని అధిపతిగా నియమించారు. శ్రీ మలయాళ స్వాములవారిపట్ల మిక్కిలి భక్తి కలిగి వుండేవారు. తిరుపతిలోని శ్రీమలయాళ సద్గురు సేవా సమాజంలో శ్రీకాళహస్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలోను యోగసాధన సప్తాహాన్ని నిర్వర్తించారు. యూట్యూబ్‌లో వారి ప్రసంగాలను నేటికీ వినవచ్చు.

1999లో నేను హైద్రాబాద్ శ్రీరామకృష్ణమఠంలో ఒక వారంరోజులు యోగవాసిష్ఠంపై ప్రసంగించాను. మొదటిరోజు నా ప్రసంగాన్ని విన్న ఈ మహనీయులు అమెరికాలో యోగావాసిష్ఠానికి గల ప్రాముఖ్యాన్ని వివరించి నన్ను హృదయ పూర్వకంగా అభినందించి ఆశీర్వదించారు.

కృతకృత్యులై కనుమరుగై బ్రహ్మలీనులైన శ్రీప్రజ్ఞారణ్యయోగివర్యులకు నా ప్రణామాంజులులు, మా శ్రద్ధాంజలులు.

వార్తలు

(01). కరోనా వలన ఆశ్రమ త్రినేత్ర వైద్యాలయం భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి ఏప్రిల్ నుండి 31-10-2020 వరకు మూసి వేయబడినది. కరోనా ఉధృతి తగ్గినచో 1-11-2020 నుండి పని చేయాలని త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు నిర్ణయించినది.

(02). 11-10-2020 తేది ఆదివారం శ్రీశుకబ్రహ్మాశ్రమ పరిపాలనా సంఘ సమావేశం జరిగినది. ఆ సమావేశంలో గత నెల 24-9-2020 తేది నిర్యాణం-శివసాయుజ్యం చెందిన పరిపాలనాసంఘ సభ్యుడు శ్రీకాళహస్తి నివాసి శ్రీ కె.సి.వెంకటరెడ్డి గారికి శ్రద్ధాంజలి ఘటించడమైనది. వారి కుటుంబానికి సంతాపసానుభూతిని తెలియజేయడమైనది. సదరు 11-10-2020 తేది జరిగిన సమావేశంలో ఆశ్రమ పరిపాలనాసంఘ సభ్యునిగా పూజ్య గురుదేవుల శిష్యుడు గూడూరు వాస్తవ్యుడు పాబోతు సుబ్రహ్మణ్యం గారిని శ్రీ పీఠాధిపతి స్వాములవారు నిర్ణయించడమైనది.

(03). తన ఆత్మపరిశోధనాయోగ సాధనా తరగతులు ద్వారా అనేక వందల మందిని యోగులుగా తయారు చేసిన పూజ్యశ్రీ ప్రజ్ఞారణ్య స్వాములవారి మండలారాధన కార్యక్రమం 19-10-2020 తేది అన్నారెడ్డిపాళెం శ్రీరామయోగి తపోవనంలో జరిగినది. శ్రీ విద్యాస్వరూపా నందగిరి స్వాములవారు శ్రీ ప్రజ్ఞారణ్య స్వాములవారికి శ్రద్ధాంజలి ఘటించారు.

(04). 23-10-2020 తేది శుక్రవారం నాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో చదువులతల్లి శ్రీ జ్ఞాన సరస్వతికి షోడశోపచారపూజ సహస్రనామార్చన చేయడమైనది. 24-10-2020 తేది శనివారం నాడు దుష్ట సంహారిణి, దుర్గుణ భంజని శ్రీ దుర్గామాతకు సహస్రనామ అర్చన చేయబడినది. 25-10-2020 తేది ఆదివారం నాడు ఉదయం మహాలక్ష్మికి షోడశోపచార సహిత సహస్రనామార్చన చేయబడినది. ఈ మూడు రోజులు సమష్టి లలితా సహస్ర నామపారాయణ జరిగినది. విజయదశమి రోజు పునీతమహిళా మాతలకు వస్త్రము లివ్వబడినవి.

నీ మనోబుద్ధులు సక్రమ మార్గమున వర్తించునట్లు నియమించుకొనుము. మనస్సంయమము చేకూరి నంతనే నీవిక దేనిని గూర్చియు భయపడనక్కరలేదు. మనస్సును అరికట్టుకొన గలిగితివా సాధనా పథమున విశేషముగా పురోగమించితివన్నమాటయే.

మనస్సు తంటాలుమారి గుఱ్ఱము వంటిది. అట్టి గుఱ్ఱము తన రౌతును పెడత్రోవను బట్టింపగలదు. కళ్ళెమును బిగించి గుఱ్ఱమును నిరోధింపగలవాడే సరైన త్రోవన బోగల్గును.

– స్వామి బ్రహ్మానంద

Regd.No. TRP / 123 / 2018 - 20 NovemTber 2020 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-10-2020, Permitted to post : 29th, 30th every month.



యాజ్ఞవల్క్యుడు

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం